# చీకటి వైపు

ప్రతాప రవిశంకర్

తలుపు తీసింది సుందరి.

ఎదురుగా ప్రకాశం నిలబడి వున్నాడు.

"నువ్వా" అన్నది సుందరి.

"అవును నేనే....ఇంకెవరయినా వస్తారను కున్నావా"

"అవును....మా అమ్మ అనుకున్నాను."

లోపలకు వెళ్ళాడతను. గోడవారగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. ప్రకాశం ఎదురుగా సుందరి కూర్చుంది.

"మీ అమ్మ ఆఫీసునించి అప్పుడే వస్తుందా" అడిగాడతను....

"ఒంటిగంటకే వస్తానని చెప్పింది. ఎందు వల్లనో రాలేదు. ఎవరింటికో వెళ్ళాలనిచెప్పింది. పర్మిషన్ తీసుకుని వస్తానన్నది"

"నీ చదువు ఎలావుంది?" ప్రక్కనే టేబుల్ మీది వారపత్రికను అందుకుంటూ అడిగాడు.

"బోర్ కొడుతూంది....వెధవ చదువు.... చదివినదే చదవడం....ఈ ఎకనమిక్స్‌తో చస్తు న్నాను....ఎంత చదివినా రావటంలేదు...."

"ఈసారయినా పాస్ అవుతావా?"

"నమ్మకం లేదు."

చేతిలోవున్న పుస్తకంలో ఓ కథ తీసి చద వటం మొదలుపెట్టాడు ప్రకాశం.

"కథలు చదువుతున్నావా?"

"అవును" తల వూగించాడు....

"వెధవ కథలు చెత్తగావున్నాయి....అవేం చదువుతావ్?" అంటూ అతని చేతిలోనించి ఆ వారపత్రికను లాక్కుంది సుందరి.

"మరేం చెయ్యమంటావ్?"

"మన ఎదురింటి మేడమీద గదిలోకి కొత్తగా అద్దెకు వచ్చిన ఆమెను చూశావా?" అడిగింది సుందరి.

"చూశాను."

"ఆమె గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"ఇంతవరకూ ఏ అభిప్రాయానికీ రాలేదు" చెప్పాడు.

"నేను వచ్చాను" అన్నది.

"ఏమిటి నీ అభిప్రాయం! ఆమె అంద మైనదనా?"

"ఆఁ ఏమంత అందమయినది" తేలిగ్గా అన్నది.

"మరి ఏమని?"

"ఆమె మంచిది కాదు."

"మంచి కాదా! అంటే?" కొంచెం ముందుకు వంగుతూ అడిగాడతను.

"ఆమె మనిషి మంచిది కాదు."

"ఎలా చెప్పగలవు? ఆమె నీకు ఇంతకు ముందే తెలుసా?"

"కాదు. ఇంట్లోకి వచ్చిన నాలుగు రోజుల నించీ చూస్తున్నాను. రోజూ రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆమెకోసం ఎవరో వస్తున్నారు."

"నిజంగానా"

"అవును. మొదటిరోజు రాత్రి అంతగా పట్టించుకోలేదు. కాని రెండోరాత్రి ఓ నవల చదువుతూ పడుకున్నాను. పన్నెండు గంటల వేళ పైన గదితలుపులను ఎవరో తట్టిన చప్పుడు వినిపించింది. చూస్తే ఒకాయన నిలబడివున్నాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఆయన లోపలకు వెళ్ళాడు. తలుపులు మూసు కున్నాయి. ఆ తర్వాత కొంచెంసేపటికి లైటారి పోయింది. అప్పట్నించీ రోజూ చూస్తున్నాను. అలాగే జరుగుతోంది" అన్నది సుందరి.

ప్రకాశం మాట్లాడలేదు.

ఒకసారి ఎదురింటి మేడమీద గదికేసి చూశాడు. తలుపులు మూసివున్నాయి.

"ఆమెకు ఎవరూ లేరేమో" అన్నది సుందరి.

"ఏమో. కనుక్కురమ్మంటావా?" అడిగా డతను నవ్వుతూ.

"నువ్వెందుకు కనుక్కురావడం" అన్నది.

"నీకు చెప్పటానికి."

"సర్లే మూడయినట్టుంది. కాఫీ చేస్తాను"

లేచి నిలబడింది సుందరి.

దగ్గరకు వేసివున్న తలుపులను తెరుచుకుని వంటగదిలోకి వెళ్ళింది. స్టవ్ తీసుకొచ్చి అతని ఎదురుగా గుమ్మం దగ్గరగా వుంచి వెలిగించింది. తర్వాత దానిమీద స్టీలుగిన్నెతో నీళ్ళు పెట్టింది.

ప్రకాశం మళ్ళీ ఆ వారపత్రికను చేతికి తీసుకున్నాడు. ఇంతకుముందు కొంచెం చదివిన కథను చదవటం మొదలుపెట్టాడు.

"నీ శలవు ఇవాళతో అయిపోతుందా?" అడిగింది సుందరి.

"అవును. రేపు ఆఫీసుకు వెళ్ళాలి."

"నిన్ను ఎప్పటినించో అడగాలని అనుకుంటున్నాను ఒక విషయం. మరచిపోతూనే వున్నాను" అన్నది.

"ఏమిటి?"

"మీ ఆఫీసులో అమ్మాయిలు వున్నారు కదూ?"

"అవును."

"వాళ్ళు మీతో ఫ్రీగా మూవ్ అవుతారా?"

ప్రకాశం మాట్లాడలేదు. నవ్వాడు చిన్నగా.

"మాట్లాడవేం?"

"ఎందుకు అవన్నీ అడుగుతున్నావ్?"

"ఊరికే సరదాకు."

"బాగానే మాట్లాడతారు. మగవాళ్ళతో కాంటీన్‌కి వస్తారు. కొంతమందితో అంతే ఇష్టమయిన వాళ్ళతో సినిమాలకు కూడా వెళతారు" చెప్పాడు.


"నువ్వు ఏ అమ్మాయినైనా సినిమాకు తీసుకెళ్ళావా?"

"ఆఁ"

"నిజంగానా?"

"అవును... నిజంగానే"

"ఎవర్ని" కంగారుగా అడిగింది.



"నిన్ను" నవ్వుతూ చెప్పాడు ప్రకాశం....

"చంపేశావు....నేను అడుగుతున్నది నా విషయం కాదు....మీ ఆఫీసులో అమ్మాయిల విషయం" కాఫీ కలుపుతూ అడిగింది.

"లేదు....నేను ఎవర్నీ రమ్మని అడగలేదు. ఎవరూ వస్తామనీ అనలేదు"

"ఐతే నువ్వు బుద్ధిమంతుడివన్నమాట" కాఫీ కప్పు ప్రకాశానికి అందిస్తూ అన్నది....

"కాదు" అన్నాడు....

"కాదా ఏ అమ్మాయితో సినిమాకు వెళ్ళ లేదు గదా"

"నీతో వచ్చానుగదా"

"నా విషయం వేరు"

"ఏం?"

"కాబోయే శ్రీమతిగారి హోదాలో వచ్చాను నేను" సిగ్గుపడుతూ అన్నది.

"అలాగా" అన్నాడు కప్పు కిందబెడుతూ.

"ఇవాళ రాత్రి పన్నెండుగంటల వరకూ మెలకువతో వుంటావా?" అడిగింది సుందరి.

"ఎందుకు?"

"ఎదురింటి మేడమీద గదిలో ఆమెకోసం వచ్చే మనిషిని చూడొచ్చు."

"ఎందుకు చూడటం?"

"ఎందుకేమిటి?-వూరికే....నీకూ తెలుస్తుంది ఆమె ఎలాంటి మనిషో."

"ఎలాంటిదయితే మనకెందుకు?" అని లేచి నిలబడ్డాడు ప్రకాశం.

"నీ గదిలోకి వెడుతున్నావా?" అడిగింది.

"కాదు. అలా బజారువరకు వెళ్ళొస్తాను."

"అయితే మంచి నవల ఒకటి అద్దెకు తీసుకురా" అన్నది.

"ముందు నువ్వు ఎకనమిక్స్ చదువు—నవలలు తర్వాత చదువుదువుగాని" అని బయటకు వెళ్ళిపోయాడు ప్రకాశం....

అతను వెళ్ళినవయిపే చూస్తూ నిలబడింది సుందరి.

ర ర ర

ఆదివారం. మధ్యాహ్నం పన్నెండుగంటలు కావస్తోంది.

ముందుగదిలో కుర్చీలో కూర్చుని నవల చదువుతోంది సుందరి. అప్పుడే గేటు నెట్టుకొని లోపలకు వచ్చాడు ప్రకాశం.

అతన్ని చూడగానే "భోజనం అయిందా?" అడిగింది సుందరి.

"ఇప్పుడే చేసివస్తున్నాను" అన్నాడు అతను తన గదివయిపుకు వెళుతూ.

"మా ఇంట్లోకూర్చుందువుగాని... ఇటురా" పిల్చింది.

"మీ అమ్మ ఇంట్లోలేదా?" లోపలకు వస్తూ అడిగాడు.

"లేదు....ఎవరో ఫ్రెండు ఇంటికి వెళ్ళింది"

"నువ్వు పరీక్షల్లో చదివిన నవలలన్నీ రాస్తున్నట్టున్నావు" సుందరి చేతిలోవున్న నవలను చూసి అన్నాడు ప్రకాశం.

"నవలలు రాసినా నయమే... ఇక చదువెందుకు?" నవలను మూసి ప్రక్కన పెడుతూ అన్నది సుందరి.

"మీ అక్కయ్యల దగ్గర్నుంచి ఉత్తరాలు వచ్చాయా?" అడిగాడు.

"ఎవరి దగ్గర్నుంచీ రాలేదు....నేనే రేపు రాయాలనుకుంటున్నాను."

అతను మాట్లాడలేదు.

"నువు మన వెనుక ఇంట్లో మొదటి భాగంలో వుండే ఆ మె ను ఎప్పుడయినా చూశావా?" అడిగింది సుందరి.

"చూశాను....ఎందుకు?"

"ఆమె చూపులకు ఎంత అమాయకంగా వుంటుందీ?"

"ఐతే?"

"ఇవాళ ఉదయం ఆమెను మొగుడు చచ్చేట్టు కొట్టేడుట"

"ఎందుకు?"

"ఆమె రెండ్రోజుల క్రితం పుట్టింటికని వెళ్ళిందిట....నిన్న రాత్రి పుట్టింటినించి ఆమె తండ్రి ఇక్కడకు వచ్చాడుట. కూతురు అక్కడకు రాలేదని అన్నాడు. ఇవాళ ఉదయం వచ్చిందిట. ఎవడిదగ్గరకు వెళ్ళిందోనని చావ గొట్టేడుట... "

"ఇంకెవరయినా బంధువుల ఇంటికి వెళ్ళిందేమో" అన్నాడు ప్రకాశం.

"అలాంటప్పుడు పుట్టింటికని చెప్పటం ఎందుకు?" అడిగింది సుందరి.

"ఏమో! ఆమె కారణాలు మనకేంతెలుసు?"

"నేను మాత్రం అందుకు ఒప్పుకోను" అన్నది సుందరి.

"నీ యిష్టం వచ్చినట్టు ఆలోచించుకో" అని వెళ్ళిపోయాడు ప్రకాశం.

ఆ రోజు సాయంత్రం అతని గదిలోకి వెళ్ళింది సుందరి. అతను అప్పుడే నిద్రలేచాడు.

"మేము రేపువూరికి వెళుతున్నాం"అన్నది.

"ఎందుకు?" అడిగాడు ప్రకాశం.

"మా బాబాయి కూతురు పెళ్ళి ఇంకో నాలుగు రోజుల్లో... ఓ వారంలో వస్తాము."

ప్రకాశం మాట్లాడలేదు.

"కొంచెం మా ఇల్లుకూడా చూస్తూ వుండు" అని వెళ్ళిపోయింది సుందరి.

ఆ మరురోజు సుందరి-సుందరి తల్లి వూరికి వెళ్ళిపోయేరు.

* * *

సుందరి పూర్నించి వచ్చింది తల్లితో పది రోజుల తర్వాత....వచ్చేసరికి ప్రకాశం గదికి తాళంపెట్టి వుంది. ఎక్కడికయినా వెళ్ళాడేమో అనుకుంది. కాని అతను మరురోజుకూడా రాలేదు. ఇంటివాళ్ళను కనుక్కుందా మనుకున్నా వాళ్ళు ఆ వూళ్ళో వుండరు....ప్రకాశం ఎక్కడికి వెళ్ళాడో అర్ధంకాలేదు....ఆరోజు సాయంత్రం అతని ఆఫీసుకు వెళ్ళింది....శలవు పెట్టేడని తెలిసింది.

సుందరి ఎంత ఆలోచించినా అతను ఎక్కడికి వెళ్ళాడో అర్ధంకాలేదు.

ఆ మరురోజు ఉదయం పోస్టులో సుందరికి ప్రకాశం దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. గబగబా దాన్ని విప్పి చదువసాగింది.

సుందరీ....

ఈ ఉత్తరం నీకు చాలా ఆశాభంగాన్ని కలిగిస్తుందనుకుంటాను. నేను సెకండియర్‌లో వున్నప్పుడు మీ ఇంటిపక్కనున్న గదిలోకి అద్దెకు వచ్చాను. అప్పుడు నువ్వు టెన్తు క్లాసు చదువుతున్నావు. తర్వాత నాకు ఇక్కడే ఉద్యోగం రావటంవల్ల ఆ గదినించి మారలేదు. నాలుగేళ్ళనించీ మనిద్దరిమధ్యా స్నేహంవుంది. నీలో నాకు తెలిసి ఎలాంటి లోపం లేకపోవటం వల్ల నిన్ను పెళ్ళి చేసుకుంటానని మీతో చెప్పాను. కాని నీలో వయస్సు పెరుగుతున్న కొద్దీ మనుషులను అర్థంచేసుకునే శక్తి నశించి పోతూ వచ్చింది. ప్రతి విషయాన్నీ చీకటివైపు నించే చూడటం ఎక్కువయిపోయింది. నువ్వు చెప్పిన ఎదురింటామె పక్కింటామె కథలు నిజంకాదని నాకు తెలుసు. ఎదురింటామె దగ్గరకు రాత్రిపూట వచ్చి తలుపు కొట్టేది ఆమె భర్తే. ఆయనకు మరో వూళ్ళో ఉద్యోగం.... వచ్చేసరికి ఆ టైమవుతుంది. ఇక పక్కింటామె వెళ్ళింది ఆమె అక్కయ్యగారింటికి. ఆమె అక్కయ్యకూ భర్తకూ వైరం ... ఆమె మొగుడు ఆమెకు మేనమామే. అందుకని ఆయన కొట్టేడు.

ఇక అసలు విషయం రాస్తాను. నువ్వు ఇంతమందిని వేలుపెట్టి చూపిస్తున్నావు. మీ అమ్మ ఎలాంటిదో నీకు తెలుసుననుకుంటాను. ఎలాంటి ఆస్తులూ లేకుండా పదివేల కట్నం ఇచ్చి ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు ఎలా చేసిందో నీకు తెలుసుననుకుంటాను. నాలుగయిదుసార్లు ఇతర మగవాళ్ళతో నాకు సినిమా థియేటర్లో కనిపించింది. రాత్రిపూట మీ అమ్మకోసం అప్పుడప్పుడు మగవాళ్ళు రావటం నేను గమనించానుకూడా. ఎప్పుడో పదేళ్ళక్రితం మొగుడు ఎక్కడికో పోయినా ఓ ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తూ మిమ్మల్నందరినీ ఇంత పెద్ద నగరంలో ఎలా ఇప్పటివరకూ పెంచినదీ నాకు తెలుసు. ఇవన్నీ నీకూ తెలుసు. తెలిసి కూడా నువ్వు ఎదుటివారి తప్పులను భూతద్దంలో నాకు చూపటానికి ఎందుకు ప్రయత్నించేశావో నాకు తెలీదు. దీన్నిబట్టి నీ సంస్కారం తెలుస్తోంది. నీలాంటి మనిషిని చేసుకున్న ఏ మనిషికీ మనశ్శాంతి వుండదని నా ఉద్దేశం.... అందుకే నువ్వు రాకముందే ఆ గది ఖాళీచేసి వెళ్ళిపోయాను. దయచేసి ఇకముందు నన్ను కలుసుకునే ప్రయత్నం చెయ్యవద్దు. నీలో ఆశలు కలిగించివుంటే నన్ను క్షమించు.

—ప్రకాశం.

ఆ ఉత్తరాన్ని చదివి మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది సుందరి. ◻